విద్యుత్ షాక్‌తో వివాహిత మృతి

ఓజిలి: విద్యుత్ షాక్‌తో వివాహిత మృతిచెందిన ఘటన మండలంలోని సగుటూరు వడ్డిపాళెం గ్రామంలో మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం.. గ్రామానికి సంధుజ(20)కు ఎనిమిదేళ్ల క్రితం రాపూరు మండలం, అక్కమామాపురం గ్రామానికి చెందిన ప్రసాద్‌తో వివాహమైంది. భర్తతో వివాదాల కారణంగా ఆమె వడ్డిపాళెంలో తల్లి అంకమ్మ వద్ద ఉంటోంది. ఇంటి ఆవరణలో ఉన్న విద్యుత్ మోటార్ సరిచేస్తుండగా షాక్ గురై పక్కనే ఉన్న గుంటలో పడిపోయింది. స్థానికులు హుటాహుటిన నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే సంధుజ మృతిచెందినట్టు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దారం ఆదిలక్ష్మి తెలిపారు.

మహిళ అదృశ్యం

ఏర్పేడు: మండలంలోని పాగాలి పంచాయతీ పరిధిలోని కుమ్మరిగుంట గ్రామానికి చెందిన ఓ మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి మంగళవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. కుమ్మరిగుంటకు చెందిన కల్పన(25) గత నెల 18న రాత్రి భోజనం చేసి నిద్రించింది. 19 తేదీ ఉదయం ఇంట్లో కనబడకపోవడంతో బంధువులు, పరిసర గ్రామాల్లో వెదికారు. అయినా కనిపించకపోవడంతో ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

టీటీడీకి ద్విచక్ర వాహనం విరాళం

తిరుమల: తిరుమల శ్రీవారికి మంగళవారం టీవీఎస్ సంస్థ టీవీఎస్ అపాచీ ఆర్ఆర్ 310 ద్విచక్ర వాహనాన్ని విరాళంగా అందించింది. ఈ వాహనం ధర రూ.3.5 లక్షలు అని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ముందుగా ఆలయం వద్ద ఈ వాహనానికి పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంస్థ ఎండీ, టీటీడీ బోర్డు సభ్యులు సుదర్శన్ వేణు వాహనం తాళాలను టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో తిరుమల డీఐ జానకిరామరెడ్డి, సంస్థ ప్రతినిధులు రాజారెడ్డి, భక్తవత్సలం, సిద్దార్థ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో తిరుపతి

- రూ.11 కోట్లతో రెండు నూతన రోడ్లు ప్రారంభం



నూతన రోడ్డును ప్రారంభిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్, ముద్రనారాయణ, కమిషనర్ హరిత, స్వామీజీలు



నూతనంగా నిర్మించిన రాణీపరాంతక దేవి రోడ్డు

తిరుపతి తుడా: ఆధ్యాత్మిక తిరుపతి నగరం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతోందని టీటీడీ చైర్మన్, తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకరరెడ్డి అన్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన రెండు మాస్టర్ ప్లాన్ రోడ్లను మంగళవారం ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, భూమన అభినయరెడ్డిలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ అన్ని రంగాల అభివృద్ధిలో తిరుపతి నగరం రాష్ట్రంలోనే ముందడుగు వేసిందని చెప్పారు. రహదారుల అభివృద్ధితో కొత్త పుంతలు తొక్కుతోందని అన్నారు. నూతనంగా ప్రారంభించిన అనంతాళ్వార్ మార్గానికి వారి వంశస్థులైన రంగాచారి అమృత హస్తాలతో ప్రారంభించడం తమ అదృష్టం అన్నారు. మరో మార్గం తిరుమల వెంకటేశ్వర స్వామికి మాన్యాలు, దానాలు ఇచ్చిన పల్లవుల మహారాణి రాణీ పరాంతక దేవి పేరుతో నామకరణం చేశామన్నారు. మహిళలు కూడా ఎంతో ప్రాముఖ్యత ఇచ్చే విధంగా రాణి పరాంతకదేవి, సామవాయి, ఆండాల్ గోదాదేవి పేర్లను తిరుపతి రహదారులకు పెట్టామన్నారు. నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత మాట్లాడుతూ 264 లక్షలతో అంకుర హాస్పిటల్ పక్క నుంచి సీపీఆర్ అపార్ట్‌మెంట్ వరకు నిర్మించిన రహదారికి అనంతాళ్వారు మార్గంగా, అదేవిధంగా రేణిగుంట హీరో షోరూమ్ నుంచి పద్మావతి పురం జెడ్పీ హైస్కూల్ వరకు 831 లక్షలతో నిర్మించిన రహదారికి రాణీ పరాంతకదేవి మార్గంగా నామకరణం చేశామని మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత తెలిపారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే ప్రారంభించిన మాస్టర్ ప్లాన్ రోడ్ల వలన తిరుపతి నగరంలో ట్రాఫిక్ తగ్గడమే కాకుండా సులువుగా పయనించేలా ప్రజలకు సౌకర్యం సౌకర్యవంతంగా రహదారులు నిర్మిస్తున్నామన్నారు. స్థానిక కార్పొరేటర్, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు తమ్ముడు గణేష్, రామిశెట్టి వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు ఉమా అజయ్, నరసింహాచారి, శేఖర్‌రెడ్డి, ఆదం రాధాకృష్ణారెడ్డి, నరేంద్రనాథ్, నారాయణ, తిరుపతి మునిరామిరెడ్డి, శ్రావణి, తిరుత్తణి శైలజ, దూది కుమారి, రేవతి, సంధ్య, పొన్నాల చంద్ర, బోకం అనిల్‌కుమార్, కో ఆప్షన్ సభ్యులు వెంకటరెడ్డి, ఇమామ్ సాహెబ్, రుద్రరాజు శ్రీదేవి, ఎస్ఈ మోహన్, ఎంఈ చంద్రశేఖర్, డీఈలు మహేష్, సంజీవ్ కుమార్, వైఎస్ఆర్ సీపీ నాయకులు పాలగిరి ప్రతాప్‌రెడ్డి, దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, అజయ్ కుమార్, వెంకటమునిరెడ్డి, దేవదానం, గోపీనాథ్‌రెడ్డి, మునిరామిరెడ్డి, తలారీ రాజేంద్ర, దినేష్ రాయల్, జక్కా శరత్, శ్యామల, గీతా, కాంట్రాక్టర్లు రమేష్ నాయుడు, రామకృష్ణ పాల్గొన్నారు.

లాభాల వల వేసి.. డబ్బు లాగేసి..

- 9 ఎఫ్ఎక్స్ ట్రేడర్స్ పేరిట మోసం
- గొలుసు విధానం ద్వారా విస్తరణ
- ఆరుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు

రాయచోటి టౌన్ : 9 ఎఫ్ఎక్స్ ట్రేడర్స్ పేరుతో ప్రజలను మోసం చేసిన వారిని అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. డీఎస్పీ మహబూబ్ బాషా మంగళవారం వివరాలు వెల్లడించారు. తిరుపతికి చెందిన రసూల్ సాహెబ్ 2019లో యోగానంద చౌదరితో కలిసి 9 ఎఫ్ఎక్స్ పేరుతో ఓ కంపెనీ ప్రారంభించారు. కొందరిని ఏజెంట్లుగా చేర్చుకున్నారు. 20 మంది ఖాతాదారులతో ఒక గ్రూప్ ఏర్పాటు చేశారు. ఒక్కొక్కరితో రూ.లక్ష వసూలు చేశారు. ప్రతి నెలా లక్కీడిప్ తీస్తారు. డిప్ తగిలిన వారికి పెట్టుబడి తిరిగివ్వడంతోపాటు మరో రూ.50 వేలు అదనంగా ఇచ్చి స్కీమ్ నుంచి తొలగిస్తారు. మిగిలిన 19 మందికి నెలకు రూ.3 వేలు చొప్పున కమీషన్ ఇస్తారు. అలాగే వీరిని పరిచయం చేసిన వారికి రూ.2000, రూ.1000 చొప్పున కమీషన్ ఇస్తారు. ఇలా 20 నెలలు నిర్వహించి సభ్యుడికి తాను పెట్టిన పెట్టుబడితో పాటు మరో రూ.లక్ష వచ్చే విధంగా ఆశ చూపారు.

బ్రాంచ్‌లు ఏర్పాటు

రాయచోటికి చెందిన సుబ్బారెడ్డి ద్వారా తిరుపాల్‌రెడ్డి, ఆయన ద్వారా కడపకు చెందిన చంద్రమౌళీశ్వరరెడ్డి, అతని ద్వారా నెల్లూరుకు చెందిన మల్లికార్జున రావు, రాయచోటికి చెందిన రాజేష్ యజమానులుగా వారికి వారే మార్చుకొని బ్రాంచ్‌లు ఏర్పాటు చేసుకున్నారు. వీరు మొదట తిరుపతి, తరువాత నెల్లూరు, కడప, రాయచోటిలలో బ్రాంచ్‌లు ఏర్పాటు చేశారు. ఏజెంట్ల సంఖ్య 302 మందికి చేరింది. మొత్తం 1759 మంది ఖాతాదారులను చేర్చుకుని, రూ.170 కోట్లకు పైగా వసూలు చేశారు. సభ్యులు చెల్లించిన డబ్బులతో చెప్పిన విధంగా స్కీం నిర్వహించారు. రూ.105 కోట్ల వరకు తిరిగి ఇచ్చేశారు. ఇందులో నుంచి రూ.65 కోట్లు ఏజెంట్లు, ప్రమోటర్లకు ఇచ్చారు. అప్పటి నుంచి వీరి లావాదేవీలు, వ్యాపారం ఆగిపోయింది. వినియోగదారులకు చెప్పకుండానే.. 2023 ఏప్రిల్‌లో బోర్డు తిప్పేశారు.

ప్లాట్లు తెరపైకి తెచ్చి

తరువాత రసూల్ సాహెబ్, యోగానంద చౌదరి కలిసి మిగిలిన డబ్బుతో నెలూరు జిల్లా నందిపాడు వద్ద 22 ఎకరాల పొలం కొనుగోలు చేశారు. దానికి గోల్డన్ ఫాం అండ్ డెవెలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఎర్రచందనం చెట్లు నాటించి, దానికి మల్లికార్జునరావుని డైరెక్టర్‌గా నియమించారు. ఆ 22 ఎకరాల్లో ప్లాట్లు వేసి, వాటిని మిగిలిన సభ్యులకు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలో మళ్లీ బోర్డు తిప్పేయడంతో సభ్యులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. వారు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. రసూల్ సాహెబ్, యోగానంద చౌదరి, సుబ్బారెడ్డి, తిరుపాల్‌రెడ్డి, మల్లికార్జునరావు, రాజేష్‌ను అదుపులోకి తీసుకొని, కోర్టులో హాజరు పరిచారు. సమావేశంలో అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి, అర్బన్ ఎస్ఐ నరసింహారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

బుచ్చినాయుడుకండ్రిగ: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం మండలంలోని కనమనంబేడు పంట పొలాల్లోని బావిలో లభ్యమైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. మండలంలోని కనమనంబేడు గ్రామరెవెన్యూలోని బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం ఉదయం పొలాల వద్దకు వచ్చిన రైతు రమణయ్య గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు బావిలోని మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి 40 సంవత్సరాలు వయస్సు ఉంటుందని, శరీరంపై ఆఫ్‌షర్టు, డ్రాయర్, టవల్ ఉన్నాయని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటనరసింహం తెలిపారు.

శ్రీవారిని దర్శించుకున్న మంత్రి

తిరుమల: శ్రీవారిని మంగళవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా, అధికారులు ఘనంగా లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

రాష్ట్ర వాలీబాల్ జట్ల ఎంపిక



బాలికల జట్టు

తిరుపతి ఎడ్యుకేషన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్–19 ఆంధ్ర రాష్ట్ర బాలబాలికల జట్లను ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ తిరుపతి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.జయరామయ్య మంగళవారం తెలిపారు. ఈ నెల 4నుంచి 6వ తేదీ వరకు రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–19 బాలబాలికల పోటీలను తిరుపతిలో నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి బాలబాలికల జట్లు పాల్గొన్నాయని, అందులో ఉత్తమ ప్రదర్శన కనబరచిన బాలబాలికలతో 15 ప్లస్ 15మంది క్రీడాకారులతో రాష్ట్రజట్లను ఎంపిక చేసినట్లు చెప్పారు. త్వరలో జాతీయస్థాయిలో నిర్వహించే ఎస్‌జీఎఫ్ అండర్–19 వాలీబాల్ పోటీ ల్లో ఈ జట్లు రాష్ట్రం తరపున పాల్గొంటాయన్నారు.

ఏపీ స్టేట్ అండర్–19 బాలుర జట్టు..

ఎస్.కనిష్క్, పి.సాహిత్‌చందు, ఎల్.రమేష్(విశాఖపట్నం), కె.పవన్‌కుమార్, జి.సాయి దుర్గాప్రసాద్(పశ్చిమ గోదావరి), ఏసీకె.వెంకటేష్ (వైఎస్సార్ కడప), ఎస్.పవన్ (విజయనగరం), టి.ఆదిత్య, పి.మహేష్ (తూర్పు గోదావరి), ఎం.సత్యం, ఎం.భానుప్రసాద్(శ్రీకాకుళం), జి.సాయి (చిత్తూరు)తో పాటు స్టాండ్‌బైగా కె.పైడిరాజు (విశాఖపట్నం), జి.గౌతం (కృష్ణ), ఎం.మణికంఠారెడ్డి (ప్రకాశం)ఎంపికయ్యారు.

ఏపీ అండర్–19 బాలికల జట్టు..

ఎస్.సంజన, బి.మేఘన, బి.గుణప్రియ, వి.మనోజ్ఞ(కృష్ణ), ఎన్.శ్రీవల్లి, ఎం.జ్యోష్ణ, ఎం.పావని(గుంటూరు), జి.జగదీశ్వరి, పి.వ్యాహిత (విశాఖపట్నం), స్వప్న (అనంతపురం), జె.మోక్షజ్ఞ (చిత్తూరు), బి.ఏ సుమణి (తూర్పుగోదావరి)తో పాటు స్టాండ్‌బైగా ఎ.లక్ష్మి (తూర్పు గోదావరి), పి.రేవతి (చిత్తూరు), పి.బేబి సునీత (గుంటూరు) ఎంపికయ్యారు.

9, 10 తేదీల్లో..

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో స్పీచ్ స్కేటింగ్, బేస్‌బాల్ అండర్–19 బాలబాలికల ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్లు ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్–19 జిల్లా కార్యదర్శి ఎస్.జయరామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 9వ తేదీ ఉదయం 8.45 గంటలకు తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో స్పీచ్ స్కేటింగ్ జట్ల ఎంపిక ఉంటుందన్నారు. అలాగే 10వ తేదీ మధ్యాహ్నం 2.15 గంటలకు తిరుపతి సమీపంలోని మంగళం ట్రెండ్స్ జెడ్పీ హైస్కూల్ ఆవరణలో సాఫ్ట్‌బాల్ బాలబాలికల జిల్లా జట్లు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు ప్రస్తుతం ఇంటర్ చదివే బాలబాలికలు అర్హులని, పోటీలకు హాజరయ్యే వారు పది మార్క్‌లిస్ట్, స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు తీసుకురావాలని ఆయన కోరారు.

తెగుళ్ల నివారణతో అధిక దిగుబడి

- రబీలో వరి సాగుపై ఏడీఏ భాస్కరయ్య సూచనలు

తిరుపతి అర్బన్: రబీ సీజన్‌లో వరి సాగు చేసే రైతులు చిన్నచిన్న సూచనలు పాటిస్తే పంటకు తెగుళ్లు తగ్గడంతో పాటు దిగుబడి బాగా వస్తుందని వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మెరుగు భాస్కరయ్య వెల్లడించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో వర్షాలు మొదలు కావడంతో రైతులు వరి సాగుకు సమాయత్తమవుతున్నట్లు తెలిపారు. అయితే ఈ రబీ కాలంలో నెల్లూరు మషూరి(ఎన్ఎల్ఆర్-34449), నెల్లూరు దాన్యా రాసి (ఎన్ఎల్ఆర్- 3354), సుగంధి (ఎన్ఎల్ఆర్-30491), ఎంటీయూ 1010, 1001,1224, బీపీటీ-2846 తదితర రకాలను రైతులు సాగుకు ఎంచుకోవచ్చన్నారు. నవంబర్ రెండో పక్షంలో నారు పోసుకుని డిసెంబర్ 15 లోపు నాట్లు వేయాలని సూచించారు. ఎకరానికి 25-30 కిలోల విత్తనం, 4-5 సెంట్లు స్థలంలో నారు పెంచితే, బాగా వస్తుందని చెప్పారు. వరి విత్తనాలను బావిస్టిన్ పొడర్ మందు ద్రావణంలో(లీటర్ నీటికి 2 గ్రాములు) నానబెట్టి నారు పోస్తే, పైరుకు రోగాల బెడద ఉండదని స్పష్టం చేశారు. నారు తీయడానికి వారం రోజుల ముందు ఎకరానికి సరిపడా నారు మడికి కిలో కార్బోఫ్యురాన్ 3జి గుళికలు వేసి నీరు పెట్టి ఇంకించాలని వివరించారు. తద్వారా పొలంలో నెల వరకు పంటను పురుగులు ఆశించవన్నారు. 25 రోజుల వయసు గల నారును ప్రధాన పొలంలో నాట్లు వేయడం వల్ల మంచి దిగుబడి వస్తుందని తెలిపారు.

కరెంట్ షాక్‌తో బర్రె మృతి

బుచ్చినాయుడుకండ్రిగ: మేత మేస్తున్న బర్రెపై 11 కేవీ విద్యుత్ వైరు తెగిపడడంతో బర్రె అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మండలంలోని కాంపాళెం దళితవాడలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. గ్రామానికి చెందిన రమణయ్య బర్రె సమీపంలోని పొలంలో గడ్డిమేస్తోంది. ఇంతలో 11కేవీ విద్యుత్ వైరు మండుతూ తెగి బర్రెపై పడింది. దీంతో బర్రె అక్కడికక్కడే మృతిచెందింది. 11 కేవీ వైర్లు మార్చాలని పలుమార్లు ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని సర్పంచ్ మాచేలమ్మ ఆరోపించారు.

రోడ్డు ప్రమాదంలో ఎంఈఓకు గాయాలు

వి.కోట: మండలంలోని కుమ్మరమగుడు మలుపులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుప్పం ఎంఈఓ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. కుప్పం ఎంఈఓగా పనిచేస్తున్న మహబూబ్‌బాషా చిత్తూరులో జరిగిన సమావేశానికి హాజరై, తిరిగి కుప్పం పట్టనానికి తన కారులో బయలుదేరారు. ఈ క్రమంలో వి.కోట-పలమనేరు జాతీయ రహదారిలోని కుమ్మరమడుగు క్రాస్ వద్ద వి.కోట నుంచి బైరెడ్డిపల్లెకు వెళుతున్న పాల వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఎంఈఓ మహబాబ్ బాషా తీవ్రంగా గాయపడ్డారు.

క్వారీ గుంతలో పడి మహిళ మృతి

వెదురుకుప్పం: మండంలోని ఓ వివాహిత మంగళవారం సాయంత్రం క్వారీ గుంతలో పడి మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు.. శ్రీరంగరాజపురం మండలం కటికపల్లె ఎస్టీ కాలనీకి చెందిన ఉమాపతి భార్య రాజేశ్వరి(28) పిల్లి గుండ్లపల్లె అటవీ ప్రాంతంలో పశువులు మేపు కోవడానికి పశువుల కాపరులతో కలిసి వెళ్లింది. ఈ సమయంలో బహుర్భూమికి వెళ్లి, కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఓ క్వారీ గుంతలో దిగగా ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో మునిగిపోయింది. ఈ ఘటనలో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది.

క్లుప్తంగా

గ్రామ సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డు

పెళ్లకూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులు అందుకున్న సంక్షేమ ఫలాలపై ఈనెల 9న బంగారంపేట గ్రామ సచివాలయంలో సంక్షేమ పథకాలకు సంబంధించిన బోర్డును ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమం చేపడుతున్నట్లు మంగళవారం ఎంపీడీఓ సురేష్‌బాబు తెలిపారు. అలాగే మొత్తం 13 గ్రామ సచివాలయాల పరిధిలో అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేసిన పథకాల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉండేలా బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈనెల 9నుంచి 23వరకు నిర్వహించే కార్యక్రమాలను అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులతో పాటు గ్రామ వలంటీర్లు విజయవంతం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మహాసభను జయప్రదం చేయండి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

దక్కిలి: ఈనెల 11న సికింద్రాబాద్‌లో జరగనున్న మాదిగ విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఏపీ ప్రజా సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ గద్దల మునెయ్య మంగళవారం తెలిపారు. మండలంలోని ఎమ్మార్పీఎస్ శ్రేణులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. అరుణోదయ సాంస్కృతిక రాష్ట్ర అధ్యక్షుడు డి.కృష్ణ, ఎమ్మార్పీఎస్ నేతలు పెంచలయ్య, రత్నయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో మెరుగైన ఫలితాలు


ఫిజియోథెరపీ చేస్తున్న ఫిజియోథెరపిస్ట్

చిల్లకూరు: దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీతో మెరుగైన ఫలితాలు కనిపిస్తాయని ఫిజియోథెరపిస్టు డాక్టర్ శివకుమార్ తెలిపారు. చిల్లకూరులోని భవిత కేంద్రంలో మంగళవారం చిన్న పిల్లలకు ఫిజియోథెరపీ చేశారు. ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రంలో తాము చేసే ఫిజియోథెరపీని తల్లిదండ్రులు గుర్తించి వాటిని క్రమం తప్పక ఇంటి వద్ద చేయిస్తూ వారానికి ఒకసారి భవిత కేంద్రానికి తీసుకుని వస్తేవారిలో మెరుగైన ఫలితాలను చూడవచ్చని అన్నారు. భవిత కేంద్రంలో ఇకపై ప్రతి మంగళవారం చిన్న పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తామన్నారు. సహిత ఉపాధ్యాయులు డాక్టర్ బొమ్మి నాగరాజు పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

కోట: దీపావళి సందర్భంగా బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరని తహసీల్దార్ పద్మావతి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్‌సీఆర్ భవన్ వద్ద దుకాణదారులకు కేటాయించిన స్థలాలను తహసీల్దార్ పరిశీలించారు. 13 మందికి లైసెన్స్‌లు రెన్యువల్ చేస్తూ అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. లైసెన్స్‌దారులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. దుకాణాల వద్ద ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పాటించాలన్నారు. ఎస్ఐ పుల్లారావు పాల్గొన్నారు.

మేధాశక్తి ప్రదర్శనకే చదరంగం పోటీలు


చెస్ పోటీలు ఆడుతున్న విద్యార్థులు

గూడూరురూరల్: విద్యార్థుల్లోని మేధాశక్తిని ప్రదర్శించేందుకు వేదికగా చదరంగం పోటీలు నిలుస్తాయని దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాల (డీఆర్‌డబ్ల్యూ) ప్రిన్సిపల్ హనుమంతరావు అన్నారు. స్థానిక డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో మంగళవారం అబ్దుల్‌కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చదరంగం పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు తాజుద్దీన్ పాల్గొన్నారు.

రెయిన్ కోట్స్ పంపిణీ


రెయిన్ కోట్స్‌ను అందజేస్తున్న సీఐ

గూడూరురూరల్: పట్టణంలో ట్రాఫిక్ విధులు నిర్వహించే కానిస్టేబుల్స్‌కు వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో పొణకా మల్లికార్జునరెడ్డి దాతృత్వంతో మంగళవారం రెయిన్ కోట్స్‌ను పంపిణీ చేశారు. పట్టణ సీఐ హజరత్‌బాబు చేతులమీదుగా రెయిన్ కోట్స్ అందజేశారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు బండి ధనుంజయరెడ్డి, ట్రెజరర్ కాటూరు శ్రీనివాసులు, ఏఎస్ఐలు లక్ష్మీపతి, బాబురావు పాల్గొన్నారు.

జగనన్నతో సంతృప్తికరమైన పాలన


లబ్ధిదారుకు బుక్‌లెట్ అందిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి


జోరువానలో ఓరుపల్లిలో గిరిజన సమస్యలను తెలుసుకుంటున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: కులం, మతం, ప్రాంతమనే తేడా లేకుండా అర్హతే ప్రామాణికంగా రాష్ట్రంలో సీఎం సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజలకు సంతృప్తికరమైన పాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని 6వ వార్డు ఎన్టీఆర్ కాలనీ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడపకు గడపకు వెళ్లి నేదురుమల్లి సంక్షేమలబ్ధిని వివరించి బుక్‌లెట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన అనతికాలంలోనే 99శాతం సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రతి ఇంట్లో సంక్షేమ కాంతులు నింపారన్నారు. ప్రజలు జగనన్నను ఆశీర్వదించి మళ్లీ సీఎంను చేయాలని కోరారు. స్థానిక వార్డు కౌన్సిలర్ మాడా జానకిరామయ్య, పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, వైస్‌చైర్మన్ సేతరాసి బాలయ్య, విబ్ పూజారి లక్ష్మీ, కౌన్సిలర్లు కందాటి కల్యాణి, వహిద, ఆరి శంకరయ్య, ఆటంబాకం శ్రీనివాసులు, జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, ఎల్ కోటేశ్వరరావు, నేతలు సీహెచ్ మురళీ, రొంటాల చిన్నా, గణేష్‌రెడ్డి, పేజీరాజ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆనంద దీపావళి..

జోరు వానలో తడుస్తూ గడప గడపకు..

సైదాపురం: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రజలు ఆనంద దీపావళి జరుపుకుంటున్నారని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని తుమ్మల తలుపూరు గ్రామ సచివాలయం పరిధిలో చావతిప్ప గిరిజన కాలనీ, ఓరుపల్లి, చెర్లోపల్లి, రామకృష్ణాపురం, కనకదుర్గాపురం కాలనీల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జోరు వానను కూడా లెక్క చేయకుండా నేదురుమల్లి 520 గడప గడపలకు వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించి బుక్‌లెట్‌లను అందజేశారు. స్థానిక సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నేదురుమల్లి మాట్లాడుతూ మండలంలో 7వేల మంది రైతులు రైతు భరోసా లబ్ధిపొందారని వివరించారు. మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్, కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరాజు, నేతలు రాంగోపాల్‌రెడ్డి, వెంకటప్పనాయుడు, శ్రీకాంత్, అంకమ్మ, పాపమ్మ, నక్కా రామ్మోహన్, రమణయ్య, జడమల్లి, పూసల శ్రీనివాసులు, పాప లక్ష్మమ్మ, చీర్లకోటి, ఆవుల రవి, కూచి అనంతయ్య పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రచార బోర్డులు


సంక్షేమ పథకాల ప్రచార బోర్డు

నాయుడుపేటటౌన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ సచివాలయాల వద్ద గురువారం నుంచి ప్రచార బోర్డులను ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం శ్రీనివాసులు మంగళవారం వెల్లడించారు. 9వ తేదీ నుంచి మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయం వద్ద ఇప్పటి వరకు ప్రజలు లబ్ధి పొందిన పథకాలకు సంబంధించి పూర్తి వివరాలను ప్రజలకు తెలియజేసేలా ఆవిష్కరించి ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు.

మున్సిపాలిటీ పరిధిలో..

9వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు భరత్ నగర్ సచివాలయం, 10 తేదీ ఆర్ముగం నగర్ సచివాలయం, 14 తేదీ రాజగోపాలపురం సచివాలయం, 15 తేదీ మునిరత్నంనగర్, 16 భూపయ్య కాలనీ, 17 గిండివారి తోట, 20 తేదీ శంకారపురం, 21 గరిడీ వీధి, 22 ఎల్ఏ సాగరం, 23 తేదీ లోతువానిగుంట లో సంక్షేమ పథకాల ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కమిషనర్ వివరించారు.

ప్రజాసంకల్పయాత్ర ఆరేళ్ల వేడుక


జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

నాయుడుపేటటౌన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు జరిపిన ప్రజాసంకల్పయాత్ర ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం పట్టణంలోని రెడ్డి కార్పొరేషన్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నేతలు ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. ముందుగా నేతలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, రెడ్డి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి పి.దశరాథరామిరెడ్డి, పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ జి.సిద్ధయ్య, నేతలు డి.రవి, ఎల్.సురేష్‌రెడ్డి, కె.భావన్, పి.హరి, కె.శీను, లక్ష్మయ్య, రాజాప్రణీల్, నరేష్ పాల్గొన్నారు.

కండలేరులో 11.311 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం 11.311టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిజ్‌కు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు జలాశయం ఈఈ పేర్కొన్నారు

రైతుల ఖాతాల్లో భరోసా నిధులు

గూడూరురూరల్: రూరల్ మండలం, పట్టణ ప్రాంతాల్లో 6,265 మంది రైతులకు ఐదవ విడత రైతు భరోసా కింద రూ.3.17కోట్లు వారి ఖాతాలకు జమ చేశారని గూడూరు వ్యవసాయశాఖాధికారి రమేష్ తెలిపారు. వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆయన మంగళవారం మాట్లాడుతూ రబీ సీజన్లో రైతులకు నగదు ఎంతగానో భరోసా ఇస్తుందని తెలిపారు.

పెళ్లకూరులో 6,407 మందికి..

పెళ్లకూరు: మండలంలో 6,407మంది రైతులకు రైతు భరోసా పథకం కింద నగదు వారి వారి జమ అయినట్లు స్థానిక వ్యవసాయశాఖ అధికారి ప్రవీణ పేర్కొన్నారు.

నాయుడుపేటలో 4,743 మందికి..

నాయుడుపేట: మండల పరిధిలో 4,743 మంది రైతులకు 5వ విడత రైతు భరోసా లబ్ధిచేకూరినట్లు మండల వ్యవసాయాధికారి గణేష్ మంగళవారం వెల్లడించారు. రూ.కోటి, 89 లక్షల 72 వేల నగదు వారి బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమచేస్తున్నట్లు వ్యవసాయాధికారి తెలిపారు.

ఓజిలిలో 5,859 మందికి...

ఓజిలి: మండలంలో 5,859 మంది రైతులకు రూ.2.34 కోట్ల రైతు భరోసా నిధులను బ్యాంకు ఖాతాల్లో జమచేశారని వ్యవసాయాధికారిణి విజయలక్ష్మి తెలిపారు. రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ఐదు విడతల రైతు భరోసా నగదు సాయాన్ని సీఎం పూర్తి చేశారని తెలిపారు.

ఎమ్మెల్యేను సత్కరించిన ఆటోడ్రైవర్లు



ఎమ్మెల్యే వరప్రసాద్‌రావును సన్మానిస్తున్న ఆటోడ్రైవర్లు

గూడూరురూరల్: గూడూరు నుంచి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు ఆటోలు నడుపుతూ జీవనం సాగించే ఆటోడ్రైవర్లు మంగళవారం ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావును ఆయన నివాసంలో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర ద్వారా ప్రతిఏటా రూ.10వేలు నగదు అందిస్తున్నారన్నారు. అదేవిధంగా ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు కృషిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరప్రసాద్‌రావును శాలువతో సత్కరించారు. గూడూరు ఏఎంసీ చైర్‌పర్సన్ ఓడూరు యమునమ్మ, నేతలు బి.సుబ్రమణ్యం, వినీష్‌యాదవ్ పాల్గొన్నారు.

న్యాయవ్యవస్థపై పోస్టింగ్‌లు పెడితే క్రిమినల్ కేసులు

సూళ్లూరుపేట రూరల్: న్యాయవ్యవస్థను, న్యాయమూర్తుల విధానాలపై కించపరుస్తూ ప్రజలను రెచ్చగొట్టేవిధంగా ఎవరైనా సోషల్ మీడియా, వాటాప్స్ గ్రూపుల్లో పోస్టింగులు పెడితే క్రిమినల్ కేసులు తప్పవని సూళ్లూరుపేట అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేజీ ప్రకృతికుమార్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ న్యాయవ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని భంగపరిచే విధంగా పోస్టింగ్‌లు పెడుతున్నారని ఇది మంచిది కాదన్నారు. ఇలా న్యాయవస్థపై సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు.

నవరస భరితం శ్రీనివాస సంగీత గేయధార


సాయికృష్ణ యాచేంద్రకు కిరీటధారణ

తిరుపతి కల్చరల్: చెన్నైకి చెందిన సి.శోభారాజ్ ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో మంగళవారం రాత్రి ప్రదర్శించిన శ్రీనివాస సంగీత గేయధార నవరస భరితంగా సాగుతూ సభికులను మైమరపించింది. ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వీబీ.సాయికృష్ణ యాచేంద్ర సారథ్యంలో చేపట్టిన ఈ శ్రీనివాస సంగీత గేయధారకు అవధాని ఆముదాల మురళి, డాక్టర్ పీసీ వెంకటేశ్వర్లు, కొప్పరపు అనంత శేషశైలేంద్ర, సి.శోభారాజా, సాహితీ వేత్త భూమన్ పృచ్ఛకులుగా వ్యవహరించగా, ముఖ్య అతిథిగా హాజరైన గానకోకిల పి.సుశీల సంగీత అంశం పృచ్ఛకురాలిగా వ్యవహరించారు. తెలుగు భాషకే సొంతమైన ప్రక్రియగా సంగీత గేయధార ఆద్యంతం అద్వితీయంగా సాగుతూ ప్రేక్షకులను అలరింపజేసింది. ఈ శ్రీనివాస సంగీత గేయధారకు చెన్నైకి చెందిన సంగీత విద్వాంసుడు నూకల హనుమంతరావు బృందం అద్భుతంగా వాయిద్య సహకారం అందించింది. అనంతరం గానకోకిల పి.సుశీల చేతుల మీదుగా సాయికృష్ణ యాచేంద్రకు స్వర్ణ కిరీటధారణతో ఘనంగా సత్కరించి అభినందించారు.

పెంచలకోనలో వర్షం


రాపూరులో కురుస్తున్న వర్షం

రాపూరు:మండలంలోని రాపూరు, పెంచలకోనలో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి కుండపోతగా వర్షం కురుస్తూనే ఉంది. పెంచలకోనలో భారీ వర్షం కురవడంతో సమీపంలోని కొండల్లోని జలపాతాలు కళకళలాడాయి. రాపూరులో రోడ్లన్నీ జలమయమయ్యాయి. రైతులు వరి నాట్లు వేసేందుకు సిద్ధం అవుతున్నారు.

రేపటి నుంచి 'జగనే ఎందుకు కావాలి'

దక్కిలి: ఈనెల 9వ తేదీ నుంచి దక్కిలి మండలంలో ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి ప్రచార కార్యక్రమాలు జరుగుతాయని ఎంపీపీ గోను రాజశేఖర్, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెట్లూరు జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. 9న డి.వడ్డిపల్లి, 10న దగ్గవోలు, 14న దక్కిలి, 15న మాధవయ్యపాళెం, 16 లింగసముద్రం, 17 వడ్ల మోపూరు, 20న నాగవోలు, 21 పలుగోడు, 22 పాతనాలపాడు, 23 సంగనపల్లి సచివాలయాలపరిధిలో కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

సంక్షేమ పథకాలపై అవగాహన..

దక్కిలి (బాలాయపల్లి): అలిమిలి సచివాలయం పరిధిలో గురువారం మధ్యాహ్నం 3గంటలకు సంక్షేమ పథకాల వివరాల ప్రచార బోర్డుల ఆవిష్కరణ, ప్రజలకు అవగాహన సదస్సు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రవీంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వెంకటగిరిలో..

వెంకటగిరిరూరల్: ఆంధ్రప్రదేశ్‌కు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు కావాలని అనే అంశంపై మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో 9వ తేదీ నుంచి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలు పొందుతున్న సంక్షేమ లబ్ధిని వివరిస్తూ ఆయా సచివాలయాల పరిధిలోని అధికారులు, వలంటీర్లతో గ్రామసభలు నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు మండల పరిధిలోని అన్ని సచివాలయాల్లో 9వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఒక్కోరోజు ఒక్కో సచివాలయంలో మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభించనున్నట్లు ప్రకటనలో ఆమె తెలిపారు.

వైఎస్సార్‌సీపీ వెంటే ముస్లింలు


మాట్లాడుతున్న మగ్దూమ్

గూడూరురూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంటే ముస్లింలు అండగా ఉంటారని ఆ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మగ్దూమ్ మోహిద్దీన్ అన్నారు. పట్టణంలోని మైనార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్న జనరంజక పాలన చూసి రాష్ట్ర ప్రజలంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీ వర్గాలు జగనన్నకు జేజేలు పలుకుతున్నారన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మళ్లీ సీఎంగా జగనన్నను చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రతిపక్షాల కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దని, జగనన్న చేసిన మంచి, సంక్షేమాన్ని చూసి ప్రజలు వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వెంకటగిరిరూరల్: వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని 6వ వార్డు ఎన్టీఆర్ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు నేదురుమల్లి కార్యాలయం వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చాయి.

14న సర్వసభ్య సమావేశం

దక్కిలి: దక్కిలి మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల14న ఉదయం 10 గంటలకు ఎంపీపీ గోను రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రసన్నకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీసభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

15న బాలాయపల్లిలో..

దక్కిలి (బాలాయపల్లి): బాలాయపల్లి మండల సాధారణ సర్వసభ సమావేశం ఈనెల 15వ తేదీన ఉదయం10–30 గంటలకు ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రవీంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు తప్పకుండా హాజరుకావాలని ప్రకటనలో ఆయన కోరారు

దరఖాస్తు చేసుకోండి

రాపూరు: మండలంలోని రాపూరు, తెగచర్ల గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ అప్పాజీ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 9వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, 10వ తేదీ ఇంటర్వ్యూలు ఉంటాయని 13న పోస్టింగ్ ఇస్తారని పేర్కొన్నారు. రాపూరు జనరల్, తెగచర్ల బీసీ మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన ప్రకటనలో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

తడ: జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీడ్రైవర్ మృతిచెందాడు. ఎస్ఐ జేపీ శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడుకు చెందిన డ్రైవర్ కుమార్(38) గుమ్మిడిపూండి, సిప్‌కాట్‌లో ఉన్న ఎడిబుల్ ఆయిల్ ఫ్యాక్టరీలో లారీడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున ఆయిల్ లోడుతో ట్యాంకర్‌ను తీసుకుని కృష్ణపట్నం పోర్టుకు బయలుదేరాడు. అయితే లారీ అక్కంపేట గ్రామం వద్ద వర్షం పడడంతో అదుపుతప్పి ముందు వెళ్తున్న మరో లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లారీ క్యాబిన్‌లోనే కుమార్ ఇరుక్కుపోవడంతో స్థానికుల సాయంతో పోలీసులు బయటకు తీశారు. తీవ్రంగా గాయపడ్డ అతన్ని చికిత్స కోసం ఆస్పత్రికి తరలిస్తుండగా కుమార్ మార్గమధ్యలో మృతిచెందడంతో మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.